క్లుప్తంగా

నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలి


రహదారి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: ప్రభుత్వ నిబంధనల మేరకు నాణ్యతా ప్రమాణాలతో రహదారిని నిర్మించాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. పాశర్లపూడిలంకలో జరుగుతున్న రహదారి నిర్మాణ పనులను శుక్రవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ రూ.1.40 కోట్లతో పాశర్లపూడిలంక వంతెన నుంచి ఆదుర్రు వరకు ప్రధాన రహదారిని నిర్మిస్తున్నామన్నారు. ఎప్పటి నుంచో అధ్వానంగా ఉన్న రహదారికి ఎమ్మెల్యే చిట్టిబాబు కృషితో అభివృద్ధి చెందడంతో స్థానికులు అభినందనలు తెలిపారు.

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి రూ.25 వేల విరాళం


దాతలకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ చైర్మన్

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్మిస్తున్న నిత్యాన్నదాన భవన నిర్మాణానికి అమెరికాలో స్థిరపడిన కె.శ్రీనివాసరావు-సత్యశ్రీలక్ష్మి దంపతులు రూ.25 వేల విరాళం అందించినట్టు ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. దాతలకు ఆలయ చైర్మన్ చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందజేశారు.

ఘనంగా బీపీ మండల్ జయంతి


మలికిపురం పూలే-అంబేడ్కర్ భవనంలో నిర్వహించిన మండల్ జయంతి

మలికిపురం: స్థానిక పూలే-అంబేడ్కర్ భవనంలో శుక్రవారం బీసీ మండల కమిషన్ వ్యవస్థాపకుడు, బీసీల అధ్యయన కమిటీ చైర్మన్ బీపీ మండల్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బహుజన సమన్వయ సమాఖ్య అధ్యక్షుడు గెడ్డం తులసీ భాస్కరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వక్తలు ఆయన చేసిన సేవలను వివరించారు. సమాఖ్య ప్రధాన కార్యదర్శి గుబ్బల బాబ్జీ, మండల ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గెడ్డం ఫిలిప్‌రాజు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లి శివకుమార్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గుబ్బల రమేష్, తాడి వర్మ పాల్గొన్నారు.

28 వేల ఎకరాల్లో ఈ-పంట నమోదు పూర్తి


ఊడిమూడిలో ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న బోసుబాబు

పి.గన్నవరం: ప్రస్తుత సీజన్‌లో జిల్లాలో ఇప్పటికి 28 వేల 350 ఎకరాల్లో ఈ-పంట నమోదు కార్యక్రమం పూర్తయిందని జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసుబాబు తెలిపారు. జిల్లాలో 1.7 లక్షల ఎకరాల్లో వరి పంటను సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నామని, ఇప్పటికి 1.5 లక్షల ఎకరాల్లో వరి నాట్లు వేశారని ఆయన వివరించారు. నూతన విధానంలో ప్రవేశపెట్టిన యాప్ ద్వారా మండలంలోని ఊడిమూడి గ్రామంలో జరుగుతున్న ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయన వ్యవసాయ సిబ్బందికి పలు సూచనలిచ్చారు. అనంతరం బోసుబాబు విలేకరులతో మాట్లాడారు. ఈ-పంట నమోదుపై గ్రామ సభల ద్వారా అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. వచ్చే నెలాఖరులోగా ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో పి.గన్నవరం ఏడీఏ జేఎస్‌వీ రామ్మోహన్‌రావు, ఏఓలు కల్యాణ్ సూర్యకుమార్, పవన్‌కుమార్, సర్పంచ్ నూకపెయ్యి ప్రసన్నకుమార్, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వరలక్ష్మీ నమోస్తుతే..


అంతర్వేది రాజ్యలక్ష్మి అమ్మవారి సన్నిధిలో వరలక్ష్మీ పూజల్లో పాల్గొన్న భక్తులు


మామిడికుదురులో సామూహిక వరలక్ష్మీ వ్రతం ఆచరిస్తున్న విద్యార్థినులు

- భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు

అంబాజీపేట: మహిళలు తమకు కోరిన వరాలు సిద్ధించేలా చేసుకొనే పండుగల్లో వరలక్ష్మీ వ్రతాన్ని శుక్రవారం మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. అమ్మవారిని ప్రతిమలను ఇంటిలో పెట్టుకొని మహిళలంతా పూజలు నిర్వహించుకొన్నారు. అంబాజీపేట, కె.పెదపూడి, పుల్లేటికుర్రు, వ్యాఘ్రేశ్వరం, ఇరుసుమండ, ముక్కామల, పసుపల్లి, వక్కలంక, కముజువారిలంక, చిరతపూడి, ఇసుకపూడి, గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం, మొసలపల్లి, వాకలగరువు, తొండవరం, నందంపూడి గ్రామాల్లోని అమ్మవారి ఆలయాలు మహిళలతో కిటకిటలాడాయి. అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు.

ఆత్రేయపురంలో..

ఆత్రేయపురం: మండలంలోని 17 గ్రామాల్లో ఉచిత సామూహిక వరలక్ష్మి పూజలు మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మహిళలు వేకువజామునే గౌతమీ, వశిష్టా గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి ఆయా ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు పండ్లు, పూలు, మామిడాకులతో అలంకరించి వరలక్ష్మీ వ్రతాన్ని జరుపుకోగా పలువురు తమ ఆనవాయితీ ప్రకారం వరలక్ష్మీదేవీని అలంకరించి వ్రతం చేసుకున్నారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: శ్రావణమాసంలో రెండో శుక్రవారం వరలక్ష్మీదేవి వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో ఆచరించారు. ఐశ్వర్యాన్ని, సౌభాగ్యాన్ని ప్రసాదించాలని వరలక్ష్మీదేవిని వేడుకున్నారు. మామిడికుదురు దీప్తి స్కూల్‌లో విద్యా సంస్థల అధినేత డీవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థినులు సామూహికంగా వరలక్ష్మీదేవి వ్రతం ఆచరించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి సందడి చేశారు. వరలక్ష్మీదేవి వ్రతం సందర్భంగా మండలంలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కోలాహలంగా మారాయి. ఇళ్లల్లో వ్రతం ఆచరించిన మహిళలు గ్రామంలోని అమ్మవార్లను దర్శించుకుని ముడుపులు, మొక్కులు చెల్లించారు.

అంతర్వేదిలో..

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో రాజ్యలక్ష్మి తాయారు అమ్మవారి ఉపాలయం వద్ద రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం పర్వదినం సందర్భంగా ఆలయ ఏసీ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ కుంకుమ పూజలు మహిళలు నిర్వహించారు. తొలుత అమ్మవారి ఉపాలయం వద్ద ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యుల నేతృత్వంలో అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలను చేశారు. సుమారు 250 మంది మహిళా భక్తులు వరలక్ష్మీ వ్రత పూజల్లో పాల్గొన్నారు. ఎటువంటి పూజా రుసుం లేకుండా అమ్మవారి రూపు, పూజా సామగ్రి, ప్రసాదం దేవస్థానంలో దాతల సహకారంతో ఉచితంగా ఆలయ సిబ్బంది అందజేశారు. పూజలు అనంతరం స్వామివారి దర్శనం, నిత్యాన్నదాన పథకంలో భోజన వసతి దేవస్థానం ఏర్పాటు చేసింది.

అమ్మవారికి కుంకుమ పూజలు

రావులపాలెం: మండల గ్రామాల్లో శుక్రవారం పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఊబలంకలో సర్వమంగళా సమేత ఉమామహేశ్వరస్వామి, రావులపాలెం, ఈతకోట గ్రామాల్లో కనకదుర్గ అమ్మవారి ఆలయాలతో పాటు పలు శివాలయాలు, రామాలయాల్లో వరలక్ష్మి వ్రతం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక కుంకుమపూజలు, స్వామివారి అభిషేకాలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు జరిపారు.


ఆలమూరులో చక్కగా అలంకరించిన వరలక్ష్మీ దేవికి నైవేద్యం సమర్పించిన దృశ్యం

ఆలమూరులో..

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో మహిళలు వరలక్ష్మి వ్రతం వేడుకలను వైభవంగా జరుపుకొన్నారు. తెలుగు హిందుత్వ లోగిళ్లు ఆధ్యాత్మికతతో నిండి పిండివంటలతో కళకళలాడాయి. వేకువజామునే పుణ్యస్నానమాచరించిన భక్తులు సమీపంలోని అమ్మవారి ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మరి కొంతమంది మహిళలు బంగారు రూపులను ధరించి ఇంట్లోనే అమ్మవారిని చక్కగా అలంకరించి నైవేద్యాలను సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. పలు ఆలయాల వద్ద నిర్వాహకులు సాంస్కృతిక, భజన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: మండలంలోని అయినవిల్లి, ముక్తేశ్వరం, తొత్తరమూడి, విలస, సిరిపల్లి, వీరవల్లిపాలెం తదితర గ్రామాల్లో అమ్మవారి ఆలయాలు మహిళా భక్తులతో కిక్కిరిశాయి. శ్రావణ శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక వ్రత పూజలు చేసి అమ్మవారికి నైవేద్యం చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం గ్రామంలోని అమ్మవారి కోవెలకు చేరుకుని అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. మహిళా భక్తులతో ఆలయాలు కిక్కిరిశాయి.

ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలి

అంబాజీపేట: ప్రతి విద్యుత్ వినియోగదారుడు తమ కరెంటు కనెక్షన్‌ను ఆధార్ నంబర్‌తో అనుసంధానం చేసుకోవాలని అమలాపురం ఈఈ ఎంవీ రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత సిబ్బందికి ఆధార్ జెరాక్స్ అందజేసి సహకరించాలన్నారు. ప్రతి విద్యుత్ వినియోగదారుడు మీ సేవ కేంద్రంలో ఆధార్ జెరాక్స్‌లు అందించాలన్నారు. విద్యుత్ కనెక్షన్ పూర్వీకుల పేరున ఉన్నవారు కూడా ప్రస్తుత వారసులు తమ ఆధార్ నంబర్ ఇచ్చి పేరు మార్చుకోవాలని సూచించారు.

మాదిగల విశ్వరూప సభను విజయవంతం చేద్దాం

మామిడికుదురు: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం త్వరలో హైదరాబాద్‌లో జరగనున్న మాదిగ, అనుబంధ కులాల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ వల్లూరి సత్తిబాబు మాదిగ పిలుపునిచ్చారు. మామిడికుదురు అంబేడ్కర్ సామాజిక భవనంలో శుక్రవారం జరిగిన మండల కార్యకర్తల సమావేశానికి జిల్లా అధికార ప్రతినిధి నూటికుర్తి సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఎంఎస్‌పీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ సమావేశంలో సత్తిబాబు మాట్లాడుతూ హైదరాబాద్ సభకు గ్రామ, మండల, నియోజకవర్గం నుంచి ప్రతి ఇంటి నుంచి మాదిగ, ఉప కులాల ప్రతినిధులు పాల్గొని సత్తా చాటాలన్నారు. జిలా ఎంఎస్‌పీ అధ్యక్షుడు యార్లగడ్డ సత్తిబాబు మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గకరణ జరిగితేనే మాదిగ, అనుబంధ కులాలకు సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సేవలతోనే గుర్తింపు

మామిడికుదురు: మగటపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో కె.హరనాథ్ 14 ఏళ్లు సుదీర్ఘంగా సేవలందించారని సర్పంచ్ సూరిశెట్టి లక్ష్మి పేర్కొన్నారు. హెచ్‌ఎంగా పని చేస్తూ పెదపట్నంలంక బదిలీ అయిన హరనాథ్, సూర్యభవాని దంపతులను శుక్రవారం స్థానికులు ఘనంగా సత్కరించారు. సభలో సర్పంచ్ లక్ష్మి మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా 8 ఏళ్లు, హెచ్‌ఎంగా 6 ఏళ్లు మొత్తం 14 ఏళ్లు హరనాథ్ పని చేశారని చెప్పారు. విద్యార్థులను క్రమశిక్షణతో చదివించారని పేర్కొన్నారు. ఇతనితో పాటు పాఠశాల నుంచి ఇటీవల బదిలీ అయిన నలుగురు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మట్టా గంగయ్య, పీఏసీఎస్ చైర్మన్ బొలిశెట్టి భగవాన్, వైఎస్సార్ సీపీ జిల్లా యూత్ విభాగం అధ్యక్షుడు సూరిశెట్టి బాబి, హెచ్‌ఎం కస్తూరి హనుమంతరావు, స్థానికులు కలిగితి పళ్లంరాజు, నామన నాగేశ్వరరావు, కలిగితి రామకృష్ణ, ఇందుర్తి వెంకటేశ్వరరావు, బొడ్డపల్లి సాయిబాబు, బందారు పండు, గోగి గోపాలకృష్ణ, కలిగితి పళ్లంరాజు పాల్గొన్నారు.


హెచ్‌ఎం హరనాథ్ దంపతులను సత్కరిస్తున్న సర్పంచ్ లక్ష్మి, స్థానికులు

ప్రతి ఇంటినీ సమగ్ర సర్వే చేయాలి

అంబాజీపేట: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారునికి సక్రమంగా అందుతున్నాయా లేదా ఏ పథకాలు అందుతున్నాయి అనే విషయాలను ప్రతి ఇంటికీ వెళ్లి సమగ్ర సర్వే చేయాలని వలంటీర్లను ఆదేశించినట్లు కొత్తపేట డీఎల్‌డీవో ఎం.ప్రభాకర్ చెప్పారు. అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిటిజన్ అవుట్‌రీచ్ ప్రోగ్రాం (సీఓపీను ప్రతి గ్రామంలోనూ నిర్వహిస్తున్నామన్నారు. సీఎం జగన్ ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలు ఏ మేరకు లబ్ధిదారునికి చేరాయో తెలుసుకునేందుకు ఈ ప్రోగ్రాంను ప్రవేశపెట్టారన్నారు. వలంటీర్‌తో పాటు సచివాలయ ఉద్యోగి ఒకరు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారన్నారు. అర్హులై ఉండి సాంకేతిక కారణాల వల్ల సంక్షేమ పథకాలు అందని వారికి లబ్ధి చేకూర్చారన్నారు. లబ్ధిదారుల ఖాతాలో పథకాలకు సంబంధించిన సొమ్ములను జమ చేశారన్నారు. మండలంలో 19 సచివాలయాలకు 8 సచివాలయాల నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. వెల్నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రాలకు సంబంధిచి ఆయా భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. త్వరలో వాటి నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. డీఎల్‌డీఓ వెంట ఎంపీడీఓ కె.సత్యనారాయణ ఉన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ ప్రభాకర్

మెరుగైన సేవలు అందిస్తున్నాం

రాజోలు: ఆర్బీకేల ద్వారా వ్యవసాయశాఖ రైతులకు మెరుగైన సేవలు అందిస్తుందని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని చింతలపల్లి, శివకోటి గ్రామాల్లోని ఆర్బీకేలను ఆయన పరిశీలించారు. ఈ-క్రాప్ నమోదు వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతుల కోసం అందుబాటులో ఉంచిన ఎరువుల గొడౌన్లలో నిల్వలను తనిఖీ చేశారు. ఈ-క్రాప్ నమోదు లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. చింతలపల్లి, శివకోటి గ్రామాల్లో వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి రైతులతో వరి సాగులో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పంటబీమా, గిట్టుబాటు ధర, ఎరువులు, పురుగుమందులు, వైఎస్సార్ యంత్రసేవా పథకాలపై అవగాహన కల్పించారు. ఏడీఏ ఎస్‌జేవీ రామ్మోహనరావు, ఏఓ వై.మధుకుమార్, వీఏఏలు చంద్రశేఖర్, వర్మ, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


చింతలపల్లిలో ఆర్‌బీకే రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు

సంపూర్ణ పారిశుధ్య చర్యలు తీసుకోవాలి

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందుకు వీలుగా ప్రతి శుక్రవారాన్ని పొడివారం (డ్రైడే)గా పాటించి సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.మల్లికార్జున, పి.భవానీశంకర్ కోరారు. ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశా సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. దీనివల్ల క్రిమి, కీటకాలు దరి చేరవని, తద్వారా అంటు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు. వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది ఫ్రైడేను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, ఎస్.వెంకటేశ్వర్లు, పి.ఉమ, సీహెచ్ బేబి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అన్నార్తులకు అమృత హస్తం

రాజోలు: శ్రీ సత్యసాయి సేవా సమితి ద్వారా అమృత హస్తం పేరుతో అందిస్తున్న భోజన క్యారేజీలతో వృద్ధుల ఆకలి తీరుతుందని జిల్లా శ్రీసత్యసాయి సంస్థ అధ్యక్షుడు అడబాల కొండబాబు అన్నారు. శుక్రవారం రాజోలులో దివంగత బిక్కిన సీతారాంబాబు సతీమణి సీతాలక్ష్మి సహకారంతో రెండుపూటలా తొమ్మిది మంది వృద్ధులకు భోజన క్యారేజీలు అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రముఖ న్యాయవాది పాడ్రేవు పాపయ్యపంతులు జ్యోతి ప్రజ్వలన చేసి అమృత హస్తం కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాలో ఏడు సంవత్సరాలుగా ఊబలంక సమితిలో 145 క్యారేజీలు, కొత్తపేట సమితిలో 22 క్యారేజీలు, పసలపూడిలో 13 క్యారేజీలు అందిస్తున్నామని కొండబాబు తెలిపారు. ప్రస్తుతం రాజోలు నాలుగో యూనిట్ ద్వారా అవసరమైన అన్నార్తులకు క్యారేజీలు అందిస్తున్నామని వాటి సంఖ్య మరింత పెంచుతామన్నారు. డాక్టర్ కాశిన ప్రభాకర్, డాక్టర్ జి.ప్రభాకర్, డాక్టర్ బిక్కిన రాఘవేంద్రరావు, రొటేరియన్ దార్ల పెదబాబు తదితరులు పాల్గొన్నారు.


రాజోలులో అమృతహస్తం కార్యక్రమంలో భోజన క్యారేజీ అందిస్తున్న సేవాసమితి సభ్యులు

కాలువలో పడి వ్యక్తి మృతి

కొత్తపేట: ప్రమాదవశాత్తూ ఒక వ్యక్తి కాలువలో పడి మృతి చెందినట్టు స్థానిక ఏఎస్సై డి.శశాంక తెలిపారు. ఆమె తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కపిలేశ్వరపురం మండలం వీధివారిలంక గ్రామానికి చెందిన తోటకూర శ్రీనివాస్ (47) కూలిపని చేసుకుంటూ జీవిస్తున్నాడు. దానిలో భాగంగా గురువారం కొత్తపేట బాలయోగిపేటకు తాపీ పని నిమిత్తం వచ్చాడు. పని పూర్తయిన అనంతరం సాయంత్రం 4 గంటల సమయంలో బొబ్బర్లంక-ముక్తేశ్వరం ప్రధాన పంట కాలువరేవులో కాళ్లు కడుక్కునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ కాలు జారి గల్లంతయ్యాడు. దాంతో గాలింపు చర్యలు చేపట్టారు. కాగా శుక్రవారం మండలంలోని వానపల్లి హైస్కూల్ వద్ద శ్రీనివాస్ మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై తెలిపారు.

రోగాలపై అలసత్వం వద్దు

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణంలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక రోగంతో ఇబ్బందులు పడుతున్నారని వాటిపై నిర్లక్ష్యం చేయకుండా తగిన వైద్యం చేయించుకోవాలని అంబాజీపేట వైద్యాధికారి కేవీఎస్ శ్రీనివాస్ అన్నారు. ఇసుకపూడి శివారు తురకలదొడ్డిలో సీహెచ్‌ఓ బి.అప్పారావు ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సుమారు 70 మంది రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో లేవలేని పరిస్థితుల్లో ఉన్న రోగులు ఇళ్లకు వెళ్లి వారిని పరీక్షించి తగు సల హాలు సూచనలు అందజేశారు. ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రైడే-ఫ్రైడే కార్యక్రమాన్ని సీహెచ్‌ఓ అప్పారావు పర్యవేక్షణలో నిర్వహించారు. నివాస ప్రాంతాల్లో ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు వివరించారు. దోమల వల్ల వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

వరద బాధిత కుటుంబాలకు నిత్యావసర కిట్ల పంపిణీ



వరద బాధిత కుటుంబాలకు నిత్యావసర కిట్లు అందజేస్తున్న తహసీల్దార్

పి.గన్నవరం: వరద బాధిత కుటుంబాలకు నెస్లే కంపెనీ సమకూర్చిన బియ్యం, నిత్యావసరాల కిట్లను జూనియర్ చాంబర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మానేపల్లిలో పంపిణీ చేశారు. మానేపల్లి గ్రామ సచివాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో మానేపల్లి, వాడ్రేవుపల్లి, బెల్లంపూడి గ్రామాలకు చెందిన మొత్తం 450 వరద బాధిత కుటుంబాలకు తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్ నిత్యావసర సరకుల కిట్లు అందజేశారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ మూర్తి, కార్పొరేషన్ డైరెక్టర్ మద్దుల వరలక్ష్మి, నెస్లే ఇండియా మేనేజర్ వశీం అహ్మద్, జేసీఐ వైస్ ప్రెసిడెంట్ జేసీ మత్తి వన్నన్, డైరెక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి, జేసీఐ జోన్ ప్రెసిడెంట్ జీఎస్ఎన్ వర్మ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు పితాని నర్సింహారావు, కంపెనీ ప్రతినిధులు రామసుబ్బారావు, రవితేజ, తేజ నాయుడు, నరాల శ్రీనివాసరావు, అడబాల సాయి తదితరులు పాల్గొన్నారు.

నాసా కాంటెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ

సఖినేటిపల్లి: స్థానిక శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు అమెరికాలోని నాసా స్పేస్ సెటిల్మెంట్‌కు ఇటీవల పంపిన ది మైండ్ స్పేస్ ప్రాజెక్ట్‌కు జాతీయ స్థాయిలో ప్రథమ స్థానం పొందినట్టు స్కూల్ ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్కూల్‌లో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన విద్యార్థులను అభినందించారు. ముఖ్యఅతిథిగా స్కూల్ రీజినల్ ఇన్‌చార్జ్ పార్థసారథి, అకడమిక్ కోఆర్డినేటర్ శ్రీకాంత్‌లు మాట్లాడుతూ, నాసా కాంటెస్ట్‌కు తమ విద్యార్థులు పంపిన ప్రాజెక్ట్ ఎంపిక కావడం సంతోషకరమన్నారు. అనంతరం నాసా స్పేస్ సెటిల్మెంట్ పంపిన ప్రశంసాపత్రాలను విద్యార్థులకు వారు అందజేశారు. అకడమిక్ డీన్ అరుణకుమార్, నాసా ప్రాజెక్ట్ ఇన్‌చార్జ్ కరుణ కుమారి పాల్గొన్నారు.


నాసా పంపిన సర్టిఫికెట్లతో విద్యార్థులు

రైతులకు అందుబాటులో ఆర్బీకేలు

మామిడికుదురు: రైతులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు గ్రామాల్లోనే అందుబాటులో ఉండే విధంగా రైతు భరోసా కేంద్రాలు(ఆర్బీకేలు) ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. లూటుకుర్రులో రూ.23.24 లక్షలతో నూతనంగా నిర్మించిన ఆర్బీకేని శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, ఇతర మౌలిక సదుపాయాలను ప్రభుత్వం గ్రామస్థాయిలోనే అందుబాటులోకి తీసుకు వచ్చిందన్నారు. మండల కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఆర్‌బీకేల ద్వారా రైతులకు సంబంధించిన అన్ని సేవలు వారి వద్దకే తీసుకు రావడం జరిగిందన్నారు. ఈ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, ఎంపీటీసీ నామన వెంకటేశ్వరరావు, మండల జేసీఎస్ కన్వీనర్ జక్కంపూడి వాసు, పార్టీ నేతలు కుసుమ శ్రీధర్, అడబాల చక్రపాణి, చింతా రామకృష్ణ, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, గెడ్డం వెంకటేశ్వరరావు, గుబ్లింక సత్యనారాయణ, గెడ్డం కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


లూటుకుర్రులో ఆర్బీకేని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

సొసైటీల పాలకవర్గ సభ్యులకు శిక్షణ

మలికిపురం: మండలంలోని లక్కవరం మంగెన గంగయ్య కల్యాణ మండపంలో శుక్రవారం జాయింట్ ఫార్మింగ్ కో ఆపరేటివ్ సొసైటీలు, కో ఆపరేటివ్ కలెక్టివ్ ఫార్మింగ్ సొసైటీల పాలకవర్గ సభ్యులకు లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ అనే అంశంపై మూడు రోజుల శిక్షణ తరగతులను ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ప్రారంభించారు. నేషనల్ కో ఆపరేటివ్ ట్రైనింగ్ ఎడ్యుకేషన్ (న్యూఢిల్లీ), ఏపీ రాష్ట్ర సహకార యూనియన్(విజయవాడ)ల ఆధ్వర్యంలో రామదాసు సహకార శిక్షణా కేంద్రం (రాజమహేంద్రవరం), 1964 ఏపీ సహకార చట్టం ముఖ్య అంశాలపై నేటి నుంచి 27వ తేదీ వరకూ శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. శిక్షణ తరగతుల్లో ఎమ్మెల్యే రాపాక ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ, సహకారం బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. ఏపీ రాష్ట్ర సహకార యూనియర్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, రాష్ట్ర సహకార యూనియన్ మేనేజింగ్ డైరెక్టర్ అలీ అక్బర్ బాషా, జిల్లా సహకార అధికారి ఎ.రాధాకృష్ణారావు, డివిజినల్ సహకార అధికారి టి.బుజ్జియ్య, రామదాసు సహకార శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసు, ట్రైనింగ్ ఇన్‌చార్జ్ ఆదిమూలం వెంకటేశ్వరరావు, సొసైటీల పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.


లక్కవరం సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

అన్నదానానికి రూ.25 వేల విరాళం

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే అన్నదాన ట్రస్టుకు శుక్రవారం మురమళ్లకి చెందిన సరిపెల్ల సాయి సూర్యనారాయణరాజు, త్రివేణి దంపతులు రూ.25 వేలు ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణకు అందజేశారు. దాతకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం, శేష వస్త్రంను ఆలయ అర్చకుడు ఉండి దత్తు అందజేశారు.

అభిమానుల సంబరాలు

అమలాపురం రూరల్: అల్లు అర్జున్ జాతీయ ఉత్తమ నటుడిగా అవార్డు గెలుచుకున్న సందర్భంగా అభిమానులు సంబరాలు చేసుకున్నారు. టౌన్ వైడ్ అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కొంకాపల్లిలోని హరి మనో వికాస కేంద్రం మానసిక వికలాంగుల పాఠశాలలో ఫ్యాన్స్ అధ్యక్షుడు వర్రే శేషు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. మానసిక వికలాంగులకు పండ్లు పంచి భోజన సదుపాయం కల్పించారు.

అంతర్వేది చెరువు నిర్మాణం పనుల పరిశీలన


అంతర్వేది చెరువు రక్షణగోడ పనులను పరిశీలిస్తున్న ఎస్ఈ కృష్ణారెడ్డి

సఖినేటిపల్లి: అంతర్వేదిలో జేజేఎంలో నిర్మితమవుతున్న తాగునీటి ప్రాజెక్ట్ పనులను శుక్రవారం ఆ శాఖ ఎస్ఈ కృష్ణారెడ్డి పరిశీలించారు. ఇందులో భాగంగా చెరువు చుట్టూ సాగుతున్న రక్షణ గోడ నిర్మాణ పనులను చూశారు. అనంతరం ఆయన ప్రాజెక్ట్ పురోగతి పనులను కాంట్రాక్టర్‌తో సమీక్షించారు. చెరువుకు అవుట్‌లెట్, ఇన్‌లెట్ మార్గాలను కూడా పరిశీలించారు. డిసెంబర్ నాటికి చెరువుకు నల్లమట్టితో బెడ్ ఏర్పాటు చేసే పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. డీఈ వరప్రసాద్, ఏఈ శిరీష పాల్గొన్నారు.